
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 20 । మార్చి । 2023



పదింతల సన్నద్ధం


సరిగ్గా రెండు వారాలే మిగిలింది.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడింది.. ఈ పరీక్షలకు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. - వివరాలు 8లో▸



ఆహార పానీయాలే ఆరోగ్య నిర్ణేతలు

తినే ఆహారం, తాగే నీరు వ్యక్తి ఆయుష్షును నిర్ణయిస్తాయని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. - 8లో▸

డెల్టాలకు 5,855 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 5,855 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదాన పథకానికి విరాళాల వెల్లువ



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఆచంట హనుమ రూ.50 వేలు, ఎ.సూర్యనారాయణ, సత్యవతిలు రూ.25 వేలు, కైకలూరుకు చెందిన కె.వెంకట సాయినరేష్ రూ.10,116 విరాళాలుగా సమర్పించినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోచిరాజు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ స్వామి ఆలయ ఆదాయం రూ.56 వేలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం వివిధ విభాగాల ద్వారా రూ.56,658 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ తెలిపారు. స్వామివారి దర్శనం టిక్కెట్ల, లడ్డూ విక్రయాల ద్వారా రూ.37,500, నిత్యాన్నదాన పథకానికి రూ.19,158 ఆదాయం వచ్చిందన్నారు. స్వామివారిని 982 మంది దర్శించుకుని, 604 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

కిటకిటలాడిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. నూతన వాహనాలకు పలువురు పూజలు చేయించుకున్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనం టిక్కెట్లకు రూ.11 వేలు, అన్నదానానికి విరాళాలుగా రూ.49 వేలు, వివిధ సేవలకు రూ.10 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.24 వేలు, వివిధ విరాళాలుగా రూ.9 వేలు వచ్చాయని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు వివరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, ముమ్మిడివరం మండలాల్లో ఖాళీగా ఉన్న 20 అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు సీడీపీవో కేవీఎల్‌డీ కుమారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను 31వ తేదీ లోపు అమలాపురం నల్ల వంతెన వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహితులు అర్హులన్నారు. 2022 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలని అన్నారు. అమలాపురం మండలంలో 3 అంగన్‌వాడీ కార్యకర్తలు, రెండు సహాయకులు, అల్లవరం మండలంలో 5 సహాయకులు, ఉప్పలగుప్తం మండలంలో 4 సహాయకులు, అంబాజీపేట మండలంలో ఒక కార్యకర్త, 4 సహాయకులు, ముమ్మిడివరం మండలంలో ఒక సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నామని వివరించారు.

నేడు యథావిధిగా 'స్పందన'

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాలు సోమవారం జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా స్థాయి, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డొక్కాడడం లేదు..



మూలకు చేరిన తాళ్ల తయారీ యంత్రాలు

- కొబ్బరి డొక్క పీచు ధర పతనం
- కిలో రూ.నాలుగు నుంచి రూ.ఐదు మాత్రమే
- మాంద్యం ప్రభావంతో చైనా నుంచి తగ్గిన ఆర్డర్లు



అంబాజీపేట మండలం మాచవరంలో పరిశ్రమ వద్ద కొండలా పేరుకుపోయిన పీచు

సాక్షి, అమలాపురం: పీచు పరిశ్రమకు 'డొక్కా'డడం లేదు.. ఆర్డర్లు లేక ఉత్పత్తి జరగడం లేదు.. ఒకవైపు ఆర్థిక మాంద్యం, మరోవైపు అంతర్జాతీయంగా తగ్గిన ఆర్డర్లు.. ఇంకో వైపు ఇతర దేశాల నుంచి పోటీ.. దేశీయంగా తగ్గిన వినియోగం.. ఇలా కారణాలు ఏమైతేనేమి కొబ్బరి డొక్క పీచు ధర అసాధారణ రీతిలో పతనమైంది. కొబ్బరి తాడు ధర కూడా తగ్గడంతో ఈ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న మహిళా ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే కొబ్బరి పొట్టుకు డిమాండ్ పెరగడంతో పరిశ్రమలు కొంత వరకూ నడుస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 950 వరకూ చిన్నా, పెద్దా పీచు, తాళ్ల ఉత్పత్తి కేంద్రాలు ఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 550 వరకూ నెలకొల్పారు. ఒక్కో పీచు ఉత్పత్తి కేంద్రంలో రోజుకు టన్ను నుంచి ఐదు టన్నుల వరకూ ఉత్పత్తి జరుగుతోంది. ఏడాదికి ఉమ్మడి జిల్లా నుంచి రూ.125 కోట్ల విలువైన పీచు ఎగుమతి అవుతోందని అంచనా. ఈ ఎగుమతులలో సింహభాగం అంటే 70 శాతం చైనాకు వెళుతుండగా, మిగిలినది మలేషియా, సింగపూర్, జపాన్‌తో పాటు గల్ఫ్, యూరప్ దేశాలకు ఉంటుంది. విశాఖపట్నం పోర్టు నుంచి నెలకు 72 కంటైనర్ల (కంటైనర్‌కు వచ్చి 20 టన్నులు) పీచు ఎగుమతి అయ్యేది. ఈ ఎగుమతులు ఆశాజనకంగా ఉండడంతోనే స్థానికంగా పీచు పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. దీనితో పాటు కొబ్బరి తాడుకు సైతం మంచి డిమాండ్ ఉండేది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి మహా నగరాలతో పాటు పలు పట్టణాలు, గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల సెంట్రింగ్‌కు తాడు వినియోగం అధికంగా ఉండేది. ప్రస్తుతం పీచు ధర కిలో రూ.నాలుగు నుంచి రూ.ఐదుకు పడిపోయింది. కరోనా ఆరంభానికి ముందు కిలో రూ.9 ఉన్న ధర లాక్‌డౌన్ సమయంలో రూ.ఏడుకి పడిపోయింది. లాక్‌డౌన్ ఎత్తేసిన తరువాత కిలో రూ.13 నుంచి రూ.15 మధ్యన పెరిగింది. అప్పటి నుంచి రెండు నెలల వరకు ధర పడినా.. పెరిగినా కొంత వరకూ ఆశాజనకంగా ఉంది. సగటు ధర కిలో రూ.తొమ్మిది వరకూ ఉండడంతో కరోనా నష్టాల నుంచి ఉత్పత్తిదారులు త్వరగా కోలుకున్నారు. కానీ ప్రస్తుతం ఒకేసారి ధర సగానికి పైగా పడిపోవడం, ఎగుమతి లేకపోవడంతో ఉత్పత్తిదారులు డీలా పడుతున్నారు.

తగ్గడానికి కారణాలెన్నో..

- చైనాతో పాటు మలేషియా, సింగపూర్ దేశాలకు జరిగే ఎగుమతుల్లో మూడొంతులు తగ్గాయి. ఇటీవల కరోనా ప్రభావం, ఆర్థిక మాంద్యంతో ఆర్డర్లు మందగించాయని ఎగుమతిదారులు చెబుతున్నారు. అరకొరగా ఎగుమతి అవుతున్న పీచులో సింహభాగం తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఆక్రమించాయి. దీనితో స్థానిక పీచుకు డిమాండ్ తగ్గింది.
- ఉమ్మడి జిల్లాలో తయారు చేసే పరుపులు, మ్యాట్‌లలో కొబ్బరి పీచు వాడకం తగ్గింది. దీని స్థానంలో చైనా నుంచి దిగుమతి అవుతున్న రిక్రాన్ (పీవీసీ వాడే ప్లాస్టిక్ నుంచి వచ్చే పీచు తరహా ఉత్పత్తి) వాడుతున్నారు. కాయర్ పీచు కొంతకాలానికి బలపడుతోంది. అదే రిక్రాన్ ఎంతకాలమైనా మెత్తగానే ఉంటుంది. పైగా బరువు తక్కువ. కొబ్బరి పీచుతో తయారు చేసే పరుపు బరువు 19 కిలోలు ఉంటే.. రిక్రాన్‌తో తయారయ్యే పరుపు 14 కిలోలు ఉంటుంది. తేలిక పరుపులు కావడంతో వినియోగదారులు వీటికే మొగ్గు చూపుతున్నారు.
- పెద్ద నగరాలు, పట్టణాలు.. చివరకు గ్రామాల్లో సైతం భవన నిర్మాణాల్లో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. శ్లాబ్‌లు వేసేందుకు సెంట్రింగ్, పరంజీల నిర్మాణాలకు ఐరెన్ వినియోగిస్తున్నారు. దీనివల్ల డొక్క పీచుతో తయారు చేసే తాళ్ల వాడకం తగ్గింది. దీనివల్ల రూ.3 ఉండే తాడుకు ఇప్పుడు రూ.1.40 కూడా రావడం లేదు.

ఉత్పత్తి నిలిపివేశాం..



కొబ్బరి పీచు, తాళ్లకు ఆరు నెలలుగా డిమాండ్ లేదు. ఎగుమతులు భారీగా క్షీణించాయి. నెల రోజులుగా మా వద్ద పీచు ఎగుమతి చేద్దామన్నా కొనేవారు లేకుండా పోయారు. పీచు ఉత్పత్తి చేద్దామన్నా నిల్వ చేసే అవకాశం లేక నిలిపివేశాం.

-సబితా అరుణ్‌కుమార్,
పీచు ఉత్పత్తిదారుడు, మాచవరం, అంబాజీపేట మండలం

అందరికీ ఉన్నత విద్యే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతో మేలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర
- 34,097 మందికి రూ.26.28 కోట్ల జమ



అమలాపురంలో విద్యార్థులకు విద్యా దీవెన చెక్కును అందజేస్తున్న జేసీ ధ్యానచంద్ర

సాక్షి, అమలాపురం: ఉన్నత విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అన్నారు. కృష్ణా జిల్లా తిరువూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన సొమ్మును బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి జేసీ ధ్యానచంద్రతో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏటా నాలుగు విడతలలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీనిద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ తదితర కోర్సులు చదువుతున్న 34,097 మంది విద్యార్థినీ విద్యార్థులకు సంబంధించి తల్లుల ఖాతాలకు రూ.26,28,36,222 ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేసిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యను అందించడానికి సీఎం జగన్ విద్యా దీవెన పథకాన్ని ప్రారంభించారన్నారు.

జగనన్న విద్యా దీవెన పథకంలో ఐటీఐ నుంచి పీజీ వరకూ (ఇంటర్ తప్ప) చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ, వికలాంగులైన విద్యార్థులలో అర్హులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారని జేసీ అన్నారు. జగనన్న వసతి దీవెన పథకంలో ఐటీఐ విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, అంతకంటే ఎక్కువ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు రూ.20 వేల చొప్పున అందుతుందన్నారు. నాల్గో త్రైమాసికంలో అర్హులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మొత్తం తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసిందని, ఈ మొత్తాన్ని ఏడు నుంచి పది రోజులలో కళాశాలలకు అందించాలని జేసీ ధ్యానచంద్ర తెలిపారు. హితకారిణి సమాజం అధ్యక్షులు కాశీ బాల మునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో చదువు



జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో చదువు ఆటంకం లేకుండా సాగుతుంది. డిగ్రీ తొలి ఏడాదిలో మూడు పర్యాయాలు విద్యా దీవెన ద్వారా రూ.18 వేలు అందుకున్నాను. నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం తరపున కృతజ్ఞతలు.

-పెచ్చెట్టి చైతన్య సద్గురుసాయి, బీఎస్సీ, దేవగుప్తం, అల్లవరం మండలం

ఒత్తిడి లేకుండా విద్య



నేను బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాను. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతుంది. దీనివల్ల ఒత్తిడి లేకుండా ఉన్నత చదువులు చదువుకుంటున్నాను.

-పెదిరెడ్డి మాధవి నాగదుర్గాలక్ష్మి,
గాడిలంక,
ముమ్మిడివరం మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మా కుటుంబంపై ఏ విధమైన ఆర్థిక భారం పడకుండా జగనన్న విద్యా దీవెన పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఏటా క్రమం తప్పకుండా విద్యా దీవెన సొమ్ము పొందుతున్నాను. ఈ విషయంలో సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను. పేద కుటుంబాలకు విద్యా దీవెన ఓ వరం.

-చౌటుపల్లి వీర వెంకట సూర్యమణికంఠ,
కూర్మాపురం, రాయవరం మండలం

వర్షంతో ఉపశమనం

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా రబీ రైతులకు ఉపశమనం కలిగించేలా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పంటలకు మేలు చేసింది. ఆదివారం ఉదయం అడపాదడపా చినుకులు పడి వాతావరణం చల్లబడింది. జిల్లాలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ సగటున 32.1 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా అమలాపురంలో 81.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా రావులపాలెంలో 8.6 మిల్లీ మీటర్లు పడింది. సఖినేటిపల్లి 79.4, రాజోలు 64.4, అల్లవరం 46.6, మామిడికుదురు 46.6, కాట్రేనికోన 40.6, మలికిపురం 40, ఉప్పలగుప్తం 35.2, ముమ్మిడివరం 30.2, ఐ.పోలవరం 29.4, అంబాజీపేట 27.8, పి.గన్నవరం 23.8, రాయవరం 20.2, కపిలేశ్వరపురం 19.8, మండపేట 18.0, రామచంద్రపురం 14.6, కొత్తపేట 14.2, ఆత్రేయపురం 9.4, ఆలమూరు 9.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. రబీ నీటి ఎద్దడి సమస్య తీరేలా వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకూ అరకొర నీటితో ఇబ్బంది పడగా, వర్షంతో మరో వారం పది రోజులు నీటికి ఇబ్బంది లేదని చెబుతున్నారు. శివారు, మెరకలకు నీటి సరఫరా ఒత్తిడి తగ్గుతోందని ఇటు ఇరిగేషన్ అధికారులు సైతం ఊపిరి పీల్చుకుంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



దివ్యాంగుడు శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మండపేట: బాల్య మిత్రునికి అండగా నిలిచి పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రథం స్కూల్‌కు చెందిన 1987–88 బ్యాచ్ విద్యార్థులు తాము ఏర్పాటు చేసుకున్న ప్రియమిత్ర సంఘం ద్వారా ఆర్థిక చేయూతను అందించారు. పట్టణానికి చెందిన కోటిపల్లి శ్రీనివాస్ దివ్యాంగుడు. దీనికితోడు పలుమార్లు రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర అనారోగ్య, ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. అతని దీనస్థితి తెలుసుకుని చలించిన పూర్వ విద్యార్థులు రూ. 1.51 లక్షలను సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రియమిత్ర సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న చిన్నారికి రూ.1,30,555 ఇచ్చామన్నారు.

లోవలో భక్తుల సందడి

తుని రూరల్: ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. తలుపులమ్మ అమ్మవారిని ఆదివారం ఎనిమిది వేల మంది దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రవ్వ లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.76.875, పూజా టికెట్లకు రూ.30,420, కేశఖండన శాలకు రూ.3,775, వాహన పూజలకు రూ.4,190, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.68,900, విరాళాలుగా రూ.70,334 కలిపి మొత్తం రూ.2,54,494 ఆదాయం లభించిందని వివరించారు. భక్తులకు అవసరమైన సదుపాయాలను చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సిబ్బందితో కలసి ఈఓ విశ్వనాథరాజు పర్యవేక్షించారు. వర్షం కారణంగా ఆరుబయట చెట్ల కింద వంటలు, భోజనాలు చేసే భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



విజేతలతో కోనసీమ చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: కోనసీమ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి విద్యాసంస్థలో జిల్లా అండర్–17 చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్ తాడి వెంకటసురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఏబీ నాయుడు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో యర్రంశెట్టి చరణ్‌వివేక్ ప్రథమ, ద్రాక్షరపు సాత్విక్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలిక విభాగంలో గీతిక అవని ప్రథమ, పినిశెట్టి ధరణి ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు వచ్చే నెలలో జరిగే రాష్ట్ర అండర్–17 పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు నాయుడు బహుమతులు అందజేశారు.

ఆరుగురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి తరలిస్తున్న ఆరుగురిని బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్ తన సిబ్బందితో కలసి పట్టుకున్నారు. దివాన్‌చెరువు వద్ద అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం రాజవరం గ్రామానికి చెందిన బర్ల రాజబాబు, కొప్పు రాంబాబు, కొప్పు సత్తిబాబు, గుండిపాలకు చెందిన యెన్నేటి దుర్గాప్రసాద్, తమిళనాడుకు చెందిన ఆర్.దినేష్‌కుమార్, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పెదపూడి గ్రామానికి చెందిన బొట్టా శివకుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 170 కిలోల గంజాయి, రూ.3.52 లక్షల నగదు, బొలేరో వాహనం, కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ఇక నుంచి ఆరు నెలలకోసారి..

- ఆస్తి పన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు
- మున్సిపాలిటీలకు పురపాలక శాఖ ఆదేశాలు



అమలాపురం మున్సిపాలిటీలో ఇంటింటా చెత్తను సేకరిస్తున్న గార్బేజ్ టిప్పర్, పారిశుధ్య సిబ్బంది

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో నెలా నెలా విధించే చెత్త పన్ను (యూజర్ చార్జి) ఇక నుంచి ఆరు నెలలకోసారి ఆస్తి పన్నుతో కలిపి చెల్లించేలా శనివారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇంత కాలం చెత్త పన్నును పారిశుధ్య విభాగానికి చెందిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వసూలు చేసేవారు. తాజా ఆదేశాలతో ఇక నుంచి రెవెన్యూ విభాగంలోని ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు వసూలు చేస్తారు. దీంతో జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల కమిషనర్లు చెత్త పన్ను వసూళ్ల బాధ్యతలను పారిశుధ్య విభాగం నుంచి రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. నగరాలు, పట్టణాల పరిశుభ్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్లాప్ ద్వారా మున్సిపాలిటీలకు గార్బేజ్ టిప్పర్లను సమకూర్చింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర పురపాలక శాఖ క్లాప్‌ను నిర్వహిస్తోంది. ఇంటింటికీ వెళ్లి మూడు రకాలుగా చెత్తను గార్బేజ్ టిప్పర్ల ద్వారా పారిశుధ్య సిబ్బంది సేకరిస్తున్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను సేకరించి తడి చెత్తను ప్రత్యేక శుద్ధీకరణ ప్లాంట్‌ల ద్వారా తిరిగి ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో చెత్త శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. నెలా నెలా పట్టణ ప్రజలు, వ్యాపారుల నుంచి చెత్త పన్ను వసూలు చేసి రాష్ట్ర పురపాలక శాఖకు ఆయా మున్సిపాలిటీలు కొంత మొత్తాన్ని చెల్లించాలి. దీనికోసం ఒక్కో మున్సిపాలిటీకి చెత్త సేకరణ సామర్థ్యం, భవనాల సంఖ్య ఆధారంగా మొత్తాలను నిర్దేశించారు. ఉదాహరణకు అమలాపురం మున్సిపాలిటీలో నెలకు చెత్త పన్ను ద్వారా రూ.9 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈ మున్సిపాలిటీకి 12 గార్బేజ్ టిప్పర్లు సమకూర్చింది. ఒక్కో టిప్పరుకు నెలకు రూ.52 వేల చొప్పున నెలకు రూ.6.24 లక్షలు రాష్ట్ర పురపాలక శాఖకు చెల్లించాలి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాలిటీ విధిగా చెత్త పన్ను వసూలు చేయాల్సిందే. నిర్దేశించిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఛండీఘర్, తెలంగాణ రాష్ట్రాలు చెత్త పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఎన్‌జీటీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ జరిమానాలు విధించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కూడా చెత్త పన్ను వసూళ్లను అనివార్యం చేస్తూ ఆ బాధ్యతలను తాజాగా రెవెన్యూ విభాగానికి బదలాయించింది. ఇంటికి రూ.50, వ్యాపార దుకాణానికి రూ.120 అక్కడ నుంచి రూ.500 నుంచి రూ.2 వేల వరకూ ఆయా భవనాల స్థాయి, కేటగిరీలను బట్టి చెత్త పన్ను విధిస్తారు. ఈ పన్ను వసూలు చేయడం పారిశుధ్య విభాగానికి అదనపు విధులుగా ఉంటున్నాయి. పారిశుధ్య విభాగం సిబ్బంది చెత్త పన్ను వసూలుకు వెళుతుంటే కొందరు చెల్లిస్తున్నారు. మరికొందరు చెల్లించడం లేదు. అదే రెవెన్యూ విభాగం సిబ్బంది అయితే ఆస్తి పన్నుతో పాటు వసూలు చేసే పరిస్థితి ఉంటుంది. దీనికితోడు పారిశుధ్య విభాగాన్ని ఇక నుంచి పూర్తిగా చెత్త సేకరించే పనిలోనే నిమగ్నమయ్యేలా చేస్తోంది. ఉదాహరణకు ఓ ఇంటి యాజమాని నెలకు చెత్త పన్ను రూ.50 చెల్లించేవారు. ఇక నుంచి అదే ఇంటి యాజమాని ఆరు నెలలకోసారి ఆస్తి, కుళాయి చెల్లించే సమయంలోనే ఆ పన్నులతో పాటు చెత్త పన్ను రూ.300 చెల్లించాలి.

స్వాగతించే నిర్ణయం ఇది

మున్సిపాలిటీల్లో చెత్త పన్నును రెవెన్యూ విభాగాలు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం స్వాగతించేలా ఉంది. ఈ బదలాయింపుతో పన్ను చెల్లింపుదారులకు ఓ బాధ్యతను గుర్తు చేయడమే కాకుండా కచ్చితంగా చెల్లించాలనే స్పష్టత ఇస్తుంది. చెత్త పన్నును వసూలు చేసిన తర్వాత అది పూర్తిగా మున్సిపాలిటీ ఆదాయంలో జమ కాదు. అధిక శాతం నిధులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెల్లించాలి.

-ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

క్రైం కార్నర్

11 మందిపై కుక్క దాడి



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో కుక్క కాటు బాధితులు

అనపర్తి: అనపర్తిలో ఓ వీధి కుక్క 11 మందిపై దాడి చేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన వారపు సంతకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చారు. ఈ క్రమంలో స్థానిక గరల్స్ హైస్కూల్ రహదారిలో వెళ్తున్న వారిపై ఓ శునకం దాడి చేసి గాయపరిచింది. ఇందులో మండలంలోని రామవరం, లక్ష్మీనరసాపురం, అనపర్తి శివారు కొత్తూరు, అనపర్తికి చెందిన సుమారు 11 మంది గాయపడ్డారు. ఐదుగురు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరగా మిగిలిన వారు వైద్య సేవలు పొంది తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

వ్యక్తి ఆత్మహత్య



కళ్లేపల్లి ప్రేమ్‌రాజు (ఫైల్)

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై తలపెట్టి కళ్లేపల్లి ప్రేమ్‌రాజు (39) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణానికి చెందిన ఆయన గతంలో ఇసుక నిర్వహణ సంస్థలో జిల్లా ఇన్‌చార్జిగా పనిచేశారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీధర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఒత్తిడిలు కారణంగానే అతను మృతి చెందినట్లు ప్రాథమికంగా తెలుస్తుంది. మృతుడికి తండ్రి, సోదరుడు, సోదరి ఉన్నారు. కొంత కాలం కిందట తల్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

పదింతల సన్నద్ధం

- పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు
- హై సెక్యూరిటీ జోన్లుగా పరీక్ష కేంద్రాలు
- ఉమ్మడి జిల్లాలో 77,085 మంది విద్యార్థులు



రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడింది.. సరిగ్గా రెండు వారాలే మిగిలింది.. ఈ పరీక్షలకు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా విద్యా శాఖ పటిష్ట చర్యలు చేపడుతుంది. ఏప్రిల్ 3న ప్రారంభమై 18వ తేదీతో ముగియనున్న పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవసరమైన అన్ని ఏర్పాట్లూ చకచకా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1,205 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 77,085 మంది పది పరీక్షలకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని 62 మండలాల్లోని 373 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 26,129, కాకినాడ జిల్లాలో 29,988, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20,968 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సీఎస్, డీవోల నియామకం పూర్తి

పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీవో) నియామకం ఇప్పటికే పూర్తి చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారికి ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను కాకినాడ జిల్లాలో ఈ నెల 16న ఆర్జేడీ, డీఈఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 21న తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల సీఎస్, డీవోలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సీఎస్, డీవోలతో పాటు ఇన్విజిలేటర్లు, రూట్ అధికారులు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాలను హై సెక్యూరిటీ జోన్లుగా గుర్తిస్తున్నారు. గతంలో పది పరీక్షల నిర్వహణకు సీఎస్‌కు సెల్‌ఫోన్‌ను అనుమతించేవారు. పరీక్ష పేపర్ల లీకేజీ, మాల్ ప్రాక్టీస్‌కు తావులేని విధంగా ఇన్విజిలేటర్లతో పాటు సీఎస్, డీవోల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అవకాశం లేదు.

ఏడు అంకెలతో ప్రత్యేక కోడ్

ప్రశ్నపత్రం లీక్ కాకుండా ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పేపర్‌ను ఎవరైనా లీక్ చేస్తే, అది ఏ సెంటర్ నుంచి లీక్ అయ్యిందో క్షణాల్లో తెలుసుకునేందుకు ప్రశ్నపత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్‌ను ముద్రిస్తారు. పేపర్‌ను లీక్ చేసిన వారిని వెంటనే గుర్తించేందుకు విద్యాశాఖ ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్, సమాధానాలు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. 24 పేజీల బుక్‌లెట్‌కు మించి సమాధానాలు రాస్తే అదనంగా 12 పేజీల బుక్‌లెట్‌ను కూడా ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు.

జిల్లా	పాఠశాలలు	రెగ్యులర్	ప్రైవేట్	మొత్తం
తూర్పు	381	22,732	3,397	26,129
కాకినాడ	454	27,516	2,472	29,988
కోనసీమ	370	19,084	1,883	20,968

హాల్ టిక్కెట్లు సిద్ధం

ఇప్పటికే పరీక్షలకు హాల్ టిక్కెట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలకు 20 రోజుల ముందుగానే హాల్ టిక్కెట్లను సిద్ధం చేసి ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను జిల్లాలు, పాఠశాలల వారీగా వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. విద్యార్థులు తమ వివరాలతో హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్‌పై సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు అటెస్టేషన్ చేయించుకున్న తర్వాత మాత్రమే పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది.

చిన్న పొరపాటూ జరగకుండా..



పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతుంది. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా పరీక్షలను నిర్వహిస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఏర్పాట్లలో నిమగ్నం



పది పరీక్షల్లో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించాం. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో కూర్చుని పరీక్షలు రాసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ, కాకినాడ

సదుపాయాలకు ప్రాధాన్యం



పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాం.

–ఎం.కమలకుమారి, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సెల్‌ఫోన్ అనుమతించం



పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు ఏ మాత్రం అవకాశం లేని విధంగా చర్యలు తీసుకుంటున్నాం. సీఎస్, డీవోలకు కూడా సెల్‌ఫోన్ అనుమతించే ప్రసక్తి లేదు. గతేడాది మాదిరిగానే పరీక్షల సమర్థవంత నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.అబ్రహం, డీఈఓ, తూర్పుగోదావరి

ఆహార పానీయాలే ఆరోగ్య నిర్ణేతలు

- నిల్వ పదార్థాలే అనారోగ్య హేతువులు
- విశిష్ట వక్త డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- ఐఎంఏ ఆధ్వర్యంలో రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్

కాకినాడ క్రైం: తినే ఆహారం, తాగే నీరు వ్యక్తి ఆయుష్షును నిర్ణయిస్తాయని ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, ప్రతిష్టాత్మక ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డుల గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యాన ఆదివారం జరిగిన రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్ విజయవంతమైంది. ఐఎంఏ కాకినాడ అధ్యక్ష, కార్యదర్శులు మోకా పవన్‌కుమార్, చిట్ల కిరణ్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు గురుప్రసాద్, ఆర్ఎస్ జవహర్ సారథ్యంలో జరిగిన ఈ సదస్సుకు ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు శరద్‌కుమార్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జీ హాజరయ్యారు. వారితో పాటు నాగేశ్వర్‌రెడ్డి హాజరై విశిష్ట వక్తగా ప్రసంగించారు. 'జీవితంలో విజయవంతం కావడం', 'గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య రంగంలో తాజా పురోగతులు' అనే అంశాలపై చర్చించారు. అందరూ భావిస్తున్నట్లు ఫాస్ట్ ఫుడ్స్ దేహానికి హానికారకం కాదని వాటి రంగు, రుచి, వాసనను పెంచేందుకు, నిల్వ ఉంచేందుకు కలిపే సంకలనాలే తీవ్ర అనారోగ్యాలు, అధిక బరువుకు కారణమవుతున్నాయని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కేవలం ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో నిమిత్తం లేకుండా రోగాల బారిన పడి ఎందరో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో ఈ సంఖ్య పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా వాడే యాంటీబయోటిక్స్, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలు శరీరంలో అంతర్గతంగా ఉన్న సూక్ష్మ జీవ వ్యవస్థ (మైక్రోబయాలజీ) పనితీరులో ప్రతికూల మార్పులకు కారణమవుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన ఆరేళ్లలో చోటుచేసుకున్న మంచినీటి సరఫరా విధానంలో విప్లవాత్మక మార్పుల కారణంగా ఎన్నో అనారోగ్యాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. చిప్స్, నూడుల్స్‌తో పాటు ఇతర రసాయన సంకలనాలు కలిగిన ఆహారాల వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్, క్రోన్స్ డిజీస్‌తో పాటు అల్సరేటిక్ కొలైటీస్ సర్వసాధారణమైపోయాయని నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సమయ పాలన, ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేయడం, లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయడం ద్వారా జీవితంలో విజయవంతం కావొచ్చన్నారు. ఈ అకడమిక్ సదస్సులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్వపు వీసీ ఐవీ రావుతో సహా డాక్టర్లు కాదా వెంకటరమణ, సోమయాజులు, టీఎల్ఎన్ ప్రవీణ్, నరసింహన్, రామ్మోహన్ తదితరులు మెడిసిన్, సర్జరీ, ప్రసూతి, రేడియాలజీ అంశాలపై మాట్లాడారు. సదస్సులో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కళ్యాణ్ చక్రవర్తి, ఐఎంఏ కాకినాడ ఫైనాన్స్ సెక్రటరీ ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ, కార్యక్రమ ఆర్గనైజింగ్ సభ్యులు ఎంవీ ఆనంద్, వాడ్రేవు రవి, లక్ష్మీనారాయణ, బి.అనురాధ, ప్రముఖ గైనికాలజిస్టు ఏఎల్ సత్యవతి పాల్గొన్నారు. జిల్లాతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన 800 మంది వైద్యులు హాజరయ్యారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు



గ్యాస్ట్రో ఎంట్రాలజీలో పురోగతులను వివరిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సాటి జీవిని ఆదరించడమే నిజమైన ఉగాది



నటుడు నారాయణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి
- ఆయనకు గోదావరి ఆణిముత్యం అవార్డు ప్రదానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కుల మతాలను పక్కన పెట్టి సాటి మనుషులను ఆదరించడమే నిజమైన ఉగాది పండుగ అని సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. శ్రీశోభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని రోటరీ క్లబ్ సెమినార్ హాల్‌లో ఫిలాంత్రోపిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కార మహోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఉభయ రాష్ట్రాలకు చెందిన 30 మందిని పురస్కారాలతో సత్కరించారు. గోదావరి ఆణిముత్యం పురస్కారంతో ఆర్.నారాయణ మూర్తిని సత్కరించి గోదావరి మాత ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి తొలి పండుగ ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తోటివారికి సాయపడాలనే భావన అలవర్చుకోవాలని హితవు పలికారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిళ్ళంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉగాది అందరికీ శుభాలు చేకూర్చాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడిపూడి సత్యశైలజ, కేంద్ర సాహిత్య సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్‌పీ భారతి, పిఠాపురం సంస్థాన రాజవంశీకులు రాజారావు వెంకటమహిపతి రామరత్నారావు బహదూర్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బస్సు బోల్తా

ఆరుగురికి గాయాలు



తుని వద్ద బోల్తా పడిన ఆర్టీసీ బస్సును క్రేన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

తుని: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలో ఆదివారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. తుని పట్టణ పోలీసులు, ప్రయాణికుల కథనం ప్రకారం .. విజయవాడ నుంచి పార్వతీపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు తుని జాతీయ రహదారి సీతారాంపురం జంక్షన్ సమీపంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళుతున్న సర్వీస్ రోడ్డు లో బోల్తా పడింది. తెల్లవారుజాము కావడంతో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారడంతో అదుపు తప్పి ఈ ఘటన జరిగింది. దీంతో విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం తుమరాడకు చెందిన వి.కల్యాణి, వై.సింహాచలం, ఎ.సాంబశివరావు, ఎస్.అప్పన్న, విశాఖపట్నానికి చెందిన ఎం.అయ్యాంగార్, రామలక్ష్మి గాయపడ్డారు. పెద్ద శబ్దం రావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న కొందరు సంఘటన స్థలానికి చేరు కుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడి రాజా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, సత్యనాగేశ్వరరావులు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును యథాస్థితికి తీసుకువచ్చారు. ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు.

గోదావరిలోకి దూకిన యువకులు..?

కొవ్వూరు: స్థానిక రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ఇద్దరు యువకులు ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో గోదావరిలోకి దూకారు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్సై డి.భూషణం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వంతెనపై నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వైపు దూకినట్లు చూసిన వారు చెప్పారు. స్థానిక మత్స్యకారుల సాయంతో గోదావరిలో గాలిస్తున్నారు. అంతా గుమిగూడడంతో వంతెనపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

వైభవంగా వెంకన్న అధ్యయనోత్సవాలు



వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి తీర్థం, కల్యాణోత్సవాలకు ముందు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు, ఆలయ అర్చకులు వేద పారాయణ చేశారు. అనంతరం స్వామివారిని పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయ ఆవరణలో స్వామివారి అధ్యయనోత్సవాల విరామం సమయంలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారి అష్టోత్తర పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

కవిత వినిపించి.. ఓలలాడించి..



కొత్తపేట ఉగాది సాహితీ సభలో పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు, కళాకారులు

- ఆకట్టుకున్న ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం
- అద్దంకి కేశవరావు, పలువురు కవుల రచనల ఆవిష్కరణ

కొత్తపేట: ఉగాదికి ముందే కవులకు కొత్తపేట వేదికైంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ కవితా గానాలతో శ్రోతలను ఓలలాడించారు. కొత్తపేటలో కళాసాహితి ఆధ్వర్యంలో ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఎంవీఎస్ సుబ్బరాజు కల్యాణ మండపంలో జరిగిన సభకు కళాసాహితి అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు అధ్యక్షత వహించగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ ముఖ్య అతిథిగా, అంతర్జాతీయ శిల్పి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డి.రాజ్‌కుమార్ వుడయార్, ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. దివంగత కవి, అభినవ పోతన, పద్య కవితాభూషణ అద్దంకి కేశవరావు 50వ దశకంలో రచించిన అశోకుడు ఏకపాత్ర, గౌతమ కళ్యాణం నృత్య రూపకం పుస్తకాలను, కవి నేలపూడి రత్నాజీ రాసిన రాజ్యమేలే తాళంచెవి పుస్తకాన్ని కళాసాహితి ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు ఆవిష్కరించారు. కవి మధునాపంతుల సత్యనారాయణ రాసిన ఝాన్సీ మజిలీ కథలు పుస్తకాన్ని రెంటాల ఆవిష్కరించారు. సామాజిక స్పృహతో రాసే కవిత్వం సజీవం సామాజిక స్పృహతో కవిత్వం రాస్తే అది సమాజంలో ఎప్పుడూ సజీవంగా ఉంటుందని కత్తిమండ ప్రతాప్‌కుమార్ అన్నారు. కవిత్వం ఎప్పటికప్పుడు కొత్త కోణాలను ఆవిష్కరించాలని, కవి భవిష్యత్ నిర్దేశకుడు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 60 మంది కవులు తమ కవితల ద్వారా ప్రస్తుతం దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక పోకడలపై విమర్శలు, సద్విమర్శలు సంధించారు. 35 ఏళ్లుగా సాహితీ సేవ చేస్తున్న జి.సుబ్బారావును, పాల్గొన్న ప్రముఖులు, కవులు, రచయితలను శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. విందు ఏర్పాటు చేసిన కేశవరావు కుమార్తె రిటైర్డ్ హెచ్‌ఎం అద్దంకి బాలాత్రిపురసుందరికి సభ కృతజ్ఞతలు తెలియజేసింది. సీనియర్ జర్నలిస్టు టి.వేణుగోపాలరావు (హైదరాబాద్), సాహితీవేత్తలు, కవులు డాక్టర్ టీఎస్ నారాయణ, డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, బొల్లోజు బాబా, మార్ని జానకిరామ్‌చౌదరి, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తొండంగి: బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన బాబూ జగ్జీవన్‌రామ్‌కు ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మండలంలోని రావికంపాడు ఎస్సీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాదిగ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లు దళితులకు రెండు కళ్ల లాంటి వారన్నారు. చిన్న వయసులోనే జగ్జీవన్‌రామ్ మహాత్మా గాంధీజీతో కలసి భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా సుదీర్ఘ కాలం పాటు జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాకాడ గంగారావు, ఇందుగపల్లి వీరబాబు, సగరపు సత్తిబాబు, వల్లూరి ఏసు పాల్గొన్నారు.